క్లుప్తంగా

22న మౌలాలి స్వామి సరిగెత్తు


చావిడీలో కొలువు దీరిన మౌలాలి స్వామి పీరు

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో ఈ నెల 22 నుంచి మౌలాలి స్వామి సరిగెత్తు వేడుకలు నిర్వహించనున్నట్లు మౌలాలి స్వామి కమిటీ సభ్యులు లక్ష్మణగౌడు, ఖాజాహుసేన్, సురేష్, బుడ్డన్న, శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. ఈ నెల 22న చిన్న సరిగెత్తు, 23న పెద్ద సరిగెత్తు ఉంటుందన్నారు. భక్తులు స్వామి వారికి మొక్కుబడులు తీర్చుకోవడం ఆనవాయితీ. భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

కుమారస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో అదివారం కృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమార స్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య అష్టోత్తరం చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం జరిపించారు.

నాటుసారా స్వాధీనం


నాటు సారాను చూపుతున్న శ్రీశైలం సీఐ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం టోల్ గేట్ వద్ద సాధారణ తనిఖీల్లో భాగంగా సోదాలు నిర్వహిస్తుండగా..నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని, నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు శ్రీశైలం సీఐ జి.ప్రసాద రావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మండలం పెద్దచెరువు తండా కు చెందిన ఆర్తి అంకన్న శ్రీశైలంలో నాటు సారా అమ్ముదామని తీసుకొస్తుండగా టోల్గేట్ వద్ద అంకన్నను పట్టుకుని అతని వద్ద ఉన్న ఆరు లీటర్ల నాటు సారాను, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అంకన్న పై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం ఆత్మకూర్ కోర్టులో ప్రవేశ పెట్టామని వివరించారు. తనిఖీల్లో పోలీసులు రఘునాథుడు, నాను నాయక్, బాలకృష్ణ, రంగన్న, వెంకటనారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కురుకుందలో హిందూ ధర్మ ప్రచారం


ప్రచారంలో పాల్గొన్న నిర్వాహకులు

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల హిందూ ధర్మ ప్రచార కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆత్మకూరు కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మునిదాస్ మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడిని నిత్యం పూజించాలని, ప్రధానంగా భగవాన్‌కు ఊరేగింపు నిర్వహించి, మంచి మార్గంలో పయనించాలన్నారు. గతంలో శ్రీకృష్ణాష్టమి పండగను 11 రోజులపాటు చేసేవారని నేడు ఒక్క రోజుకే పరిమితమైందన్నారు. సభ్యులు పుల్లారెడ్డి, కుమారాచారి, సంజీవ, పార్థసారథి, చక్రపాణి, నాగమద్దిలేటి, భాస్కర్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నందికొట్కూరు: శాతనకోట గ్రామానికి చెందిన ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ ఎస్ఐ తిరుపాలు ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 2,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ కార్యదర్శికి సన్మానం

ఆత్మకూరు: పట్టణంలోని రైతు సేవాకేంద్రంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి మొమిన్‌ముస్నీర్‌బాషాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రైతుసేవా సంఘం అధ్యక్షులు బైరాపురం రహంతుల్లా, కృషి పండ్లతోటల సంఘం అధ్యక్షులు మహబూబ్ బాషా, టైగర్ బాబు, ఇబ్రహీం, మునలమడుగు రసూల్, నబిసా, రఫిక్, నజీర్‌మొహ్మద్, బాషా, కరిముల్లా పాల్గొన్నారు.

బేస్ బాల్ అసోసియేషన్ ట్రెజరర్‌గా పీఈటీ పుల్లయ్య

నంద్యాల(న్యూటౌన్): జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ట్రెజరర్‌గా పీఈటీ పుల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అసోసియేషన్ లీగల్ అడ్వైజర్ మాధవరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఎన్నుకున్నట్లు తెలిపారు.

మోసం.. చంద్రబాబు నైజం!


పగిడ్యాలలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్


నందికొట్కూరులో ఇంటింటికీ వెళ్లి బాబు మోసాలను వివరిస్తున్న దారా సుధీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

- డాక్టర్ దారా సుధీర్
- నందికొట్కూరు, పగిడ్యాలలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'
- ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలపై వివరణ

నందికొట్కూరు/పగిడ్యాల: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటేనే మోసానికి బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వీవీపీ కాలనీలో, పగిడ్యాలలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలకు పంగనామాలు పెట్టారని విమర్శించారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు అబద్ధపు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా ఖజానా ఖాళీగా ఉందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ఇలా ఖజానా ఖాళీగా ఉందని చెప్పలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా విపత్కర పరిస్థితుల్లోను ఏ ఒక్క సంక్షేమ పథకం ఆగిపోకుండా క్యాలెండర్ అమలు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. చంద్రబాబు అలా కాదని మోసానికి మారుపేరు ఆయననే నిరూపించుకుని దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి అన్నారు. అనంతరం స్థానిక కుంట వీధిలో ఇంటింటికి తిరిగి చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. కార్యక్రమాల్లో జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌నాయుడు, జెడ్పీటీసీ పుల్యాల దివ్య, పార్టీ పగిడ్యాల మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి, పగిడ్యాల సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్‌రెడ్డి, కోకిల రమణారెడ్డి, జబ్బార్, రాజు, ఉపేంద్రారెడ్డి, అక్తర్, అబూ బక్కర్, సురేష్, జనార్దన్‌గౌడు, మాధురి, విజయ్‌కుమార్, రవి, హరిష్, నాగార్జున, చరణ్, మధుసూధన్‌రెడ్డి, లడ్డా, నాగారజు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

పాములపాడు : ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో అనుభవం ఉంది, విజనరీ అని చెప్పుకునే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా కొత్త పథకాలకు శ్రీకారం చుట్టిన దాఖలాల్లేవని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవ రత్నాల పేరుతో అమలు చేసిన సంక్షేమ పథకాలను సూపర్‌సిక్స్ పేరిట పదింతలు చేసి ఇస్తామని కాపీ కొట్టారని విమర్శించారు. మంత్రి నారాలోకేష్ నేషనల్ టీవీ ఛానల్ ఓ ఇంటర్వ్యూలో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే అన్ని క్యాలిక్యులేట్ చేసుకున్నాం, ప్రతి హామీని నెరవేరుస్తామని, లేపోతే కాలర్ పట్టుకొని నిలదీయొచ్చు అని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రజలతో కలిసి మనము అదే పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు బషీర్ అహ్మద్, సురేష్, కో ఆప్షెడ్ ముర్తుజావలీ, ఎస్టీ సెల్ నియోజకవర్గం కన్వీనర్ కోటినాయక్, నాయకులు జబ్బార్, శేఖర్, గోపాల్, రాముడు, ప్రభాకర్, యుగంధర్‌రెడ్డి, శివలింగం, మాబాష, కమలాకర్, చరణ్, పుల్లయ్య పాల్గొన్నారు.

సొసైటీలకు కమిటీల నియామకం జరిగేనా..?


80 బన్నూరు సహకార సొసైటీ

జూపాడుబంగ్లా: ఉమ్మడి కర్నూలు జిల్లాల్లోని సహకార సొసైటీలకు చాలా వరకు పాలకవర్గ కమిటీలను నియమించారు. అయితే నందికొట్కూరు నియోజకవర్గంలోని 80బన్నూరు, బ్రాహ్మణకొట్కూరు సొసైటీలకు మాత్రం పాలకవర్గ కమిటీలను నియమించకపోవడంతో సభ్యత్వం ఉన్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జూపాడుబంగ్లా, బ్రాహ్మణకొట్కూరు సొసైటీలు ప్రత్యేక అధికారుల అజమాయిషీలో కొనసాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున పంట రుణాలు పొందేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రైతుల సంక్షేమార్థం అధికారులు సత్వరమే జూపాడుబంగ్లా, బ్రాహ్మణకొట్కూర్ సొసైటీలకు పాలక కమిటీలను నియమించి పంట రుణాలు అందేలా చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రశ్నించేందుకు వస్తున్నాం.. సమాధానం చెప్పేందుకు సిద్ధమా?

మహానంది: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అమలు చేయని వైనంపై ప్రజల పక్షాన ప్రశ్నించేందుకు గ్రామాల్లోకి వస్తున్నామని, సమాధానం చెప్పేందుకు కూటమి నేతలు సిద్ధమేనా అని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శివశంకర్‌నాయుడు సవాల్ విసిరారు. ఆదివారం రాత్రి ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో నేటి నుంచి మహానంది మండలం తమ్మడపల్లెలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పేరుతో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను వేధిస్తున్నారన్నారు. పేదల కోసం ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకుగురి చేస్తున్నారని మండిపడ్డారు. పేదల కోసం వైఎస్సార్‌సీపీ నిత్యం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలి


మాట్లాడుతున్న ఆ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు

నందికొట్కూరు: మిడుతూరు మండలంలో ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.60 కోట్లు మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిడుతూరు మండల రైతుల కలైన ఎత్తిపోతల పథకం కలగానే మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల ప్రజలకు సాగు, తాగు నీరు అందించాలని అనేక ఉద్యమాలను చేయడం జరిగిందని చెప్పారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు బీబీ, ముర్తుజాబీ, సోమన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


చిన్నపాటి వర్షానికే గుంతలు నిండడంతో ఆటో వెళ్లేందుకు తీవ్ర ఇక్కట్లు పడుతున్న దృశ్యం

రహదారి గుంతలమయం

నందికొట్కూరు: నంద్యాల–నందికొట్కూరు ప్రధాన రోడ్డు నుంచి చెరుకుచర్ల, బైరాపురం, తిమ్మాపురం, పారుమంచాల వరకు సుమారు 10 కిలో మీటర్ల మేర రోడ్డు గుంతలమయంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేరు. సీఎం చంద్రబాబు వేదికలపై ఆర్భాటంగా బహిరంగంగా గుంతల రోడ్లు మార్చినట్లు గొప్పలు చెప్పుకోవడం తప్ప ఆచరణలో శూన్యమని ప్రజలు విమర్శిస్తున్నారు. సుపారిపాలన అంటే గుంతల రోడ్లు దర్శనం ఇవ్వడమేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధికారులైనా స్పందించి ప్రజల ప్రయాణాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

అమ్మవారికి సారె


జగజ్జననీ మాతకు సారె తెస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని భక్తులు ఆదివారం శ్రీ జగజ్జనని మాతకు సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భాగంగా ఉదయమే అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. మన ఊరు–మన గుడి, మన బాధ్యత సభ్యులు కల్పనా సెంటర్‌లోని రామాలయం నుంచి ఊరేగింపుగా అమ్మవారికి సారె తీసుకొచ్చారు.

కొనసాగుతున్న నీటి విడుదల


పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి కొనసాగుతున్న నీటివిడుదల

జూపాడుబంగ్లా : శ్రీశైలం జలాశయంలో సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో 882.70 అడుగుల నీటిమట్టం ఉండగా పోతిరెడ్డిపాడు వద్ద 881.70 అడుగులు నమోదైనట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోతిరెడ్డిపాడు నాలుగుగేట్లు ఎత్తి 20వేల క్యూసెక్కుల నీటిని విడుదలను కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఉన్నతాధికారులు ఆదేశిస్తే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటివిడుదలను పెంచే అవకాశాలున్నాయని ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఏబీఆర్ కాల్వకు 205 క్యూసెక్కుల నీరు..

లాకిన్స్‌లా నుంచి అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కాల్వకు 205 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీకాల్వ ఏఈ శ్రీనివాసులునాయక్ ఆదివారం తెలిపారు. సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,300 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వినియోగానంతరం లాకిన్స్‌లాకు 1,445క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు చెప్పారు. అందులో 994 క్యూసెక్కులు నిప్పులవాగుకు, 246 క్యూసెక్కులు తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు, 205 క్యూసెక్కుల నీటిని అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.


బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

బానకచెర్ల నుంచి 20వేల క్యూసెక్కుల నీటి విడుదల

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 20వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆదివారం ఏఈ దేవేంద్ర తెలిపారు. ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరు నుంచి ఇన్‌ఫ్లో ఉన్న 20వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. తెలుగుగంగ (వీబీఆర్) కు 6,000 క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్‌చానల్‌కు 6,000 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ కు 8,000 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నామని వివరించారు.

లైన్‌మన్‌పై దాడి.. కేసు నమోదు

మహానంది : గోపవరం గ్రామంలో విద్యుత్ మరమ్మతులు చేస్తున్న లైన్‌మన్ వేణుగోపాల్‌ను అదే గ్రామానికి చెందిన బాలనడిపి మద్దిలేటి, ఆయన కుమారుడు మధుకృష్ణ కరెంట్ తీస్తావా అంటూ దుర్భాషలాడుతూ.. కొట్టారని వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేశామని మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా గొడవకు దిగారని, లైన్‌మన్‌తో పాటు మరో ఉద్యోగి రవిబాబును అడ్డుకున్నారని, దీంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

క్రిష్ణాపురంలో కార్డెన్ సెర్చ్


క్రిష్ణాపురంలో బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఆత్మకూరు: మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో ఎస్ఐ వెంకటనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానితులు, నేరచరిత్ర ఉన్నవారి ఇళ్లల్లో సోదాలు చేశారు. ధ్రువపత్రాలు సరిగా లేని పది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సోదాల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహానందిలో పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఈఓ శ్రీనివాసరెడ్డి, పండితులు, అర్చకులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి వారి ఇలవేల్పు. ఒకటి కాదు రెండు కాదు 170 ఏళ్లుగా వారణాసి కుటుంబం మహానందిలోని కామేశ్వరీ అమ్మవారికి భక్తులు. అమ్మవారి గురించి భక్తలోకానికి తెలియజేయాలనే సంకల్పంతో వారణాసి రామ్మోహన్ రావు, విజయలక్ష్మి దంపతులు శ్రీ సౌభాగ్య కామేశ్వరీదేవి వ్రతకల్పం, పూజా విధానం పుస్తకాలను సొంత ఖర్చులతో ముద్రించి తెచ్చి ఆదివారం శ్రీ కామేశ్వరీదేవి పాదాల చెంత ఉంచి పూజలు చేయించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకుల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'ని విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమై ప్రజలను మోసగించింది. దీంతో వైఎస్సార్‌సీపీ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శ్రీశైలం నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాలను చేపడుతున్నామని, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పాచక్రపాణిరెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అమలు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా హామీలను అమలు చేయకుండా ప్రజల్ని మోసగిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం చేసిన మోసాన్ని, నష్టపోయిన తీరును ప్రజలకు వివరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 21వ తేదీ ఉదయం మహానంది మండలం తమ్మడపల్లె, సాయంత్రం 4 గంటలకు గాజులపల్లె గ్రామాల్లో తొలిరోజు సమావేశాలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. 22న కడమకాలువ, సాయంత్రం 4 గంటలకు బండిఆత్మకూరులో, 23న ఉదయం ఆత్మకూరు పట్టణంలోని కొత్తపేట, సాయంత్రం 4 గంటలకు వడ్లరామాపురం గ్రామంలో, 24న ఉదయం 9 గంటలకు ఆత్మకూరు పట్టణంలోని పెద్దపీర్ల వీధి, సాయంత్రం 4 గంటలకు కరివేన గ్రామంలో, 25న ఉదయం వెలుగోడు, సాయంత్రం రేగడగూడూరులో, 26న ఉదయం బండిఆత్మకూరు మండలం సంతజూటూరు, సాయంత్రం సింగవరం గ్రామంలో, 27న ఉదయం మహానంది మండలం గోపవరం, సాయంత్రం 4 గంటలకు బొల్లవరంలో, 28న ఉదయం ఆత్మకూరులోని గరీబ్‌నగర్, సాయంత్రం 4 గంటలకు క్రిష్ణాపురం గ్రామంలో, 29న ఉదయం వెలుగోడు, సాయంత్రం మూత్కూరు, 30న ఉదయం ఆత్మకూరులోని రహమత్‌నగర్‌లో, సాయంత్రం ముష్టపల్లిలో నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 1, 2వ తేదీల్లో శ్రీశైలం, సున్నిపెంటలో గ్రామసభలు ఏర్పాటు చేస్తామని వివరించారు. సభలను శ్రీశైలం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు విజవయంతం చేయాలని పిలుపునిచ్చారు.


చేను చుట్టూ చీరలు కట్టిన దృశ్యం

చేనుకు చీరలే రక్ష!

మహానంది: పంటలను రక్షించుకునేందుకు రైతుల పాట్లు అనేకం. పక్షుల నుంచి, పందుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు పలు ప్రయోగాలు చేస్తున్నారు. అందులో భాగంగా అబ్బీపురంలోని ఓ పొలం వద్ద రైతు తన పంట పొలం చుట్టూ ఇలా చీరలను రక్షణగా ఏర్పాటు చేశాడు. రంగురంగులున్న చీరలను చూసి పందులతో పాటు ఇతర జంతువులు రావని ఇలా ఏర్పాటు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

ఆత్మకూరులో 14.4 మి.మీ. వర్షపాతం నమోదు


ఆత్మకూరులో కురుస్తున్న వర్షం

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలో ఆదివారం వేకువ జామున 14.4 మి.మీ. వర్షం కురిసింది. రెండు రోజులుగా అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం 62.4 మి.మీ., శనివారం 6.2 మి.మీ., వర్షం కురిసింది. కొద్ది రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంటలు వాడుముఖం పడుతున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న, పత్తి, కంది మెట్ట పంటలు అధికంగా సాగు చేశారు.

- **బండి ఆత్మకూరు :** మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆందోళన తొలగింది. పరమటూరు, బండి ఆత్మకూరు, ఎర్రగుంట్ల గ్రామాల రైతులు మొక్కజొన్న, మినుము, సోయా చిక్కుడు తదితర మెట్ట పంటలు సాగు చేశారు. కొద్ది రోజులుగా వర్షాలు లేక పంటలు ఎండిపోయే దశకు చేరుకోవడంతో ఈ ఏడాది కూడా నష్టాలు తప్పవేమోనని ఆందోళన చెందారు. వర్షం కురవడంతో వరి నారు పోసుకోవడానికి అనువుగా ఉంటుందని అన్నదాతలు చెబుతున్నారు.

టీకాతో ముద్ద చర్మ వ్యాధి నుంచి రక్షణ



పశువుకు వ్యాధి సోకిన దృశ్యం(ఫైల్), పరమటూరులో పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యులు

బండిఆత్మకూరు : పశువులకు వచ్చే ముద్ద చర్మవ్యాధి (లంపీ స్కిన్ డిజీస్) పాల ఉత్పత్తిపై అధిక ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధి సోకిన పశువుల చర్మంపై ముద్దలు, గడ్డలు ఏర్పడుతాయి. ఈ వ్యాధి వల్ల పశువులు ఇబ్బంది పడతాయి. ఒక్కోసారి మరణాలు సంభవించే అవకాశముందని పశువైద్యులు పేర్కొంటున్నారు. ఈ వ్యాధి నివారణకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు..

- పశువుల శరీరంపై చిన్న గడ్డలు, ముద్దలు ఏర్పడతాయి.
- పశువులకు అధిక జ్వరం వస్తుంది.
- పశువులు బలహీనంగా, అలసటగా కనిపిస్తాయి.
- ఆహారం తీసుకోకపోవడం లేదా తక్కువగా తీసుకుంటాయి.
- ముద్ద చర్మ వ్యాధి సోకిన పశువులు తక్కువ పాలు ఇస్తాయి.

వ్యాధి వ్యాప్తి ఇలా..

ముద్ద చర్మ వ్యాధి వైరస్ ద్వారా పశువుల నుంచి పశువులకు, దోమలు, ఇతర కీటకాలు ద్వారా వ్యాపిస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పశువుల నివాస ప్రదేశాలను శుభ్రంగా ఉంచాలి.
- ముద్ద చర్మ వ్యాధి సోకిన పశువులను ఇతర పశువుల నుంచి వేరుగా ఉంచాలి.
- పశువులకు దోమల నుంచి రక్షణ కల్పించాలి.
- పశువులకు సమయానికి వ్యాక్సిన్ వేయించాలి.
- ఏదైనా లక్షణాలు గమనిస్తే వెంటనే స్థానిక వెటర్నరీ వైద్యులను సంప్రదించాలి.

టీకాతో పశువులను రక్షించుకోవచ్చు



ముద్ద చర్మవ్యాధి పశువులకు ప్రమాదకరం. సరైన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చు. ప్రభుత్వం అందిస్తున్న గోట్ పాక్స్ వైరస్ వ్యాక్సిన్ వినియోగిస్తే, ఈ వ్యాధి నుంచి పశువులను కాపాడుకోవచ్చు. ప్రతి రైతు పశువైద్యాధికారుల సలహాలు పాటించి తమ పశువులను ఆరోగ్యంగా ఉంచుకోవాలి. ప్రస్తుతం పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేస్తున్నాం.

– అనూష, పశువైద్యాధికారిణి, బండిఆత్మకూరు